GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 273 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం 24-05-2024 | పేజీలు : 4



## వియాత్నాం అధ్యక్షుడిగా టో లామ్

**టీ మీడియా, మే23, వియత్నాం:** వియాత్నాం కొత్త అధ్యక్షుడుగా టో లామ్(66) ను ఆ దేశ పార్లమెంట్ బుధవారం ఖరారు చేసింది. అంతకుముందు భద్రతా సంస్థల అధిపతిగా లామ్ ఉన్నారు. లామ్ పోలీసు, ఇంటెలిజెన్స్ శాఖలను పర్యవేక్షించినప్పుడు దేశంలో ప్రాథమిక హక్కులను యథేచ్ఛగా ఉల్లంఘించారనీ, అంతర్జాతీయ చట్టాలను ధిక్కరించి విదేశాల్లో అపహరణలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. దేశాధ్యక్షుడు, స్పీకర్‌తో సహా ఉన్నత స్థాయి నాయకులు అనేకులు పదవులకు రాజీనామా చేశారు. అధ్యక్ష పదవి అలంకారప్రాయమే అయినా దేశంలో అతి ముఖ్యమైన కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ముమ్ముందు లామ్ నే వరించవచ్చని అంచనాలు వినిపిస్తున్నాయి.



# పంచాయతీ పోరుపై... కాంగ్రెస్‌లో చిచ్చు

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ఒత్తిడి
- ప్రభుత్వం నిర్ణయంపై ఉత్కంఠ

టి మీడియా, మే 23, ప్రత్యేక ప్రతినిధి:స్థానిక సమరంపై కాంగ్రెస్‌లో కొత్త చర్చ మొదలయింది. బీసీల లెక్క తేలిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు జరపాలన్న డిమాండ్ ఊపు అందుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఒత్తిడి పెరుగుతోంది. అయితే ఎన్నికల షెడ్యూల్ తరుముకొస్తుండడం.. అప్పట్లోపు బీసీల కులగనన పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో అసలు స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల కనుసన్నలలో గ్రామ పంచాయతీల పాలన సాగుతుంది. అయితే ఎక్కువ కాలం ప్రత్యేక అధికారుల పాలనలో ఉంచకుండా సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. కానీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద సవాల్?గా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా కుల గణన చేసేందుకు అసెంబ్లీ తీర్మానం చేసింది. కానీ లోక్ సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ కుల గణన ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో బీసీల జనాభా లెక్క తేలేందుకు మరింత సమయం పట్టి అవకాశాలు ఉన్నాయి.అప్పటిలోపు పంచాయతీ ఎన్నికలను ఆపే పరిస్థితి ఉండదు. బిఆర్ఎస్ హయాంలో ఉన్న రిజర్వేషన్ల ప్రకారమే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి కుదిస్తూ కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. దీన్ని సవాలు చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయిస్తే.. వచ్చే పంచాయతీ ఎన్నికల్లోపు బీసీ రిజర్వేషన్ల లెక్క తేల్చాలని సూచించింది. దానికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అదే సమయంలో బిసి కుల గణన పూర్తి చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు కాంగ్రెస్లోని బీసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని అందుకే పాత పద్ధతుల్లోనే రిజర్వేషన్లు అమలు చేస్తే పంచాయతీ ఎన్నికల్లో కూడా బీసీలకు అన్యాయం జరుగుతోందని చెబుతున్నారు. అందుకే ఐదేళ్లకు ఒకసారి వచ్చే పంచాయతీ ఎన్నికలను కొంతకాలం వాయిదా వేసి.. బీసీ జనాభా లెక్కలు తేలిన తర్వాత జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు పంచాయతీలో బీసీలకు ఇవ్వాల్సిందేనని పట్టుబడు తున్నారు.అయితే పంచాయతీ ఎన్నికలను ఆలస్యం చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పంచాయతీ ఎన్నికలను విధిగా నిర్వహించాలి సాంకేతిక లేక రాజకీయపరమైన కారణాలతో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేస్తే కేంద్ర నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు నిలిచిపోతాయి. అప్పుడు పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుంది. దీనివల్ల ప్రభుత్వం అపకీర్తిని మూటకట్టుకోవాల్సి వస్తోంది. అయితే సకాలంలో ఎన్నికలు నిర్వహిద్దామంటే ఈ బీసీల రిజర్వేషన్ అంశము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతుంది. బీసీల కులగనన త్వరగా తేల్చే అంశం కాదు. 52 శాతానికి మించి రాష్ట్రంలో బీసీ జనాభా ఉంది. దీంతో బీసీల లెక్క తెలడానికి ఎక్కువ సమయం బట్టే అవకాశాలు ఉన్నాయి. అలాగని పంచాయతీ ఎన్నికలు నిర్వహిద్దామంటే బీసీలు అంగీకరించే పరిస్థితి లేదు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ఒక బాధ.. నిర్వహించకపోతే మరొక బాధ అన్నట్లు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మారింది. దీంతో పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి ముందు నుయ్యి వెనక కొయ్యి అన్నట్లు మారింది. అయితే ఈ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అధిగమిస్తోంది అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వం మాదిరిగా బీసీల ఒత్తిళ్లకు తలొగ్గకుండా సకాలంలో కాంగ్రెస్ ఎన్నికల నిర్వహిస్తుందా లేక బీసీ కులగన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతుందా వేచి చూడాలి.

పాటియాలాలో...

## మోడీ ఎన్నికల ర్యాలీ

**-వ్యతిరేకంగా రైతుల ఆందోళనలు**



**టి మీడియా, మే 23,పాటియాలా** :గురువారం ప్రధాని నరేంద్ర మోడీ పంజాబ్‌లోని పాటియాలలో ఎన్నికల ర్యాలీ జరగనుంది. పాటియాలలోని పోలో గ్రౌండ్‌లో బహిరంగ సభ జరగనుంది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పంజాబ్‌లో ఎన్నికల ప్రచారానికి మోడీ వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో మోడీ ఎన్నికల ర్యాలీకి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆందోళనలు నిర్వహిస్తోంది. ప్రధాని మోడీ ఇప్పటివరకూ పంటకు మద్దతు ధర ప్రకటించలేదని, ఇప్పటికైనా ప్రకటించే దిశగా ఆలోచించాలని, ఈ సందర్భంగా రైతు సంఘాల నేతలతో చర్చించాలని ఎస్‌కెం నేతలు జగ్జిత్ సింగ్ దల్లేవాల్, సర్వన్‌సింగ్ పంధేర్, అమర్జీత్‌సింగ్ మోహ్రీ, మంజీత్‌సింగ్ రారులు పట్టుబడుతున్నారు. ఒకవేళ తమతో చర్చలకు ఆహ్వానించకపోతే మోడీ ప్రచార ర్యాలీ వద్దకు నల్లజెండాలతో తమ నిరసన తెలుపుతామని ఎస్‌కెఎం నేతలు చెప్పారు.మరోవైపు బిఎస్ రాజేవాల్, డాక్టర్ దర్శన్‌పాల్, హరీందర్‌సింగ్ లఖోవాల్ నేతృత్వంలోని రైతు సంఘాలు నభా, సర్హింద్, పాత్రన్, రాజ్‌పురా ఇతర మార్గాల ద్వారా పాటియాలలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నాయి. ఒకవేళ తమ నిరసనను అధికారులు అడ్డుకుంటే రైతులు రోడ్డుపై బైఠాయించి తమ ఆందోళనలను కొనసాగిస్తారని రైతు సంఘం నేత డాక్టర్ దర్శన్‌పాల్ తెలిపారు.మరోవైపు మోడీ ఎన్నికల ర్యాలీకి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పాటియాలకు వెళ్లే ఆరు రోడ్లను పోలీసులు నిర్బంధించారు. ఒక్కోరోడ్డుకు కనీసం వందమంది పోలీసులు మోహరించారు. వాహనాలను నిలువరించారు. సాయంత్రం దాకా ఈ రోడ్డు మార్గాల్లో వాహనాలకు అనుమతి లేదని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

## బౌద్ధ బిక్షులకు తగిన గౌరవం ఉంటుంది

**-ధ్యాన మందిరానికి నిధులు -ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**టీ మీడియా, మే23 ,హైదరాబాద్** :తెలంగాణలో బౌద్ధ బిక్షులకు తగిన గౌరవం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజ్యం, అధికారం ఉండి వాటిని కాదని 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించారన్నారు. రెండున్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడి ఉందని ఉద్ఘాటించారు. బుద్ద పూర్ణిమ సందర్భంగా సికింద్రాబాద్‌లోని మహా బుద్ధ విహార్‌ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని తెలిపారు.ప్రతి పనిని ధ్యానంగా చేయాలన్న సూచనలో చాలా అర్థం ఉందని ఈ సూక్తిలో నుంచి ఎంతో స్ఫూర్తిని పొందారని చెప్పారు. ఏ పని అయినా తాను ఎంతో ధ్యానంగా చేస్తానని స్పష్టం చేశారు. ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఒక పాఠశాలను నిర్వహించాలని తాను కోరుతున్నానని చెప్పారు. సమాజంలో అసహనం, అసూయ పెరిగిపోతున్నాయన్నారు. సమాజంలో స్పర్థలు, ఉద్వేగాలు పెరిగేలా వాతావరణం నెలకొని ఉందన్నారు. బుద్ధుని సందేశం దేశానికి ఇప్పుడు ఎంతో అవసరమన్నారు. బుద్ధుడి సందేశాన్ని సమాజంలో ప్రతి ఒక్కరికి చేరవేయడానికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం మీది%ౌ% అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

## తప్పుడు కేసులు పెట్టి జైలులో పెట్టారు

- నేను మూడుసార్లు ఎన్నికైన ముఖ్యమంత్రిని
- అవినీతిపరులకు రక్షణ కల్పించే బీజేపీ
- ఇమెయిల్ ఇంటర్వ్యూలో కేజ్రీవాల్



**టి మీడియా, మే 23,ఢిల్లీ :** ఢిల్లీ ఎన్నికల్లో తమ పార్టీని ఓడించలేమని బీజేపీ అంగీకరించినందునే తనపై తప్పుడు కేసులు పెట్టి జైలులో పెట్టారని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కేజ్రీవాల్ ఇమెయిల్ ఇంటర్వ్యూ సాగిందిలా...

ప్ర :అరెస్టు అయిన తర్వాత మీరు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయలేదు మరియు ఇటీవల కూడా హేమంత్ సోరెన్ రాజీనామా చేయకూడదని బిజెపి కోరుతోంది. ఏది ఏమైనప్పటికీ, ఇది ప్రభుత్వ పనితీరులో సమస్యలను తెచ్చిపెట్టవచ్చు, అది రాష్ట్రపతి పాలన విధించే పరిస్థితిని తీసుకురావచ్చు. ఫైలుపై సంతకం చేయలేని ముఖ్యమంత్రిగా ఎలా కొనసాగాలని ఆలోచిస్తున్నారు?

కేజ్రీవాల్ : నేను మూడుసార్లు ఎన్నికైన ముఖ్యమంత్రిని. ఢిల్లీ ఓటర్లలో 54% కంటే ఎక్కువ మంది ఓటు వేశారు. ముఖ్యమంత్రిగా మోడీకి కూడా 54% ఓట్లు రాలేదు. ప్రజలకు సేవ చేస్తానని, నా వాగ్దానాలను నెరవేరుస్తానని రాజ్యాంగంపై ప్రమాణం చేశాను. 2014 నుండి ఆప్ ని నాశనం చేయడానికి బిజెపి తన ప్లేబుక్‌లోని ప్రతి ఉపాయాన్ని ప్రయత్నించింది. కానీ ప్రజలు అవర్ కామ్ కీ రాజనీతి (పని రాజకీయాలు) పై విశ్వాసం ఉంచారు. బిజెపి యొక్క ద్వేషం, విభజన రాజకీయాలను తిరస్కరించారు.మీరు ఇండియా వేదిక భాగస్వాములతో మాట్లాడకుండానే "కేజ్రీవాల్ యొక్క 10 హామీలు" హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా 22 స్థానాల్లో పోటీ చేస్తున్నారు. వేదికకు సంఖ్యాబలం వస్తే సంకీర్ణ భాగస్వామ్య పక్షాల్లో మీ స్వరం ప్రతిధ్వనిస్తుందని భావిస్తున్నారా?

కేజ్రీవాల్ : మా 10 హామీలు ఏమిటి? మన కలల భారతదేశాన్ని నిర్మించడానికి అవి ఒక రోడ్‌మ్యాప్. ఇక్కడ ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశాలు ఉన్నాయి. 24 గంటల విద్యుత్ సరఫరా, మంచి విద్య, బీమా పథకాలపై ఆధారపడని ఉచిత వైద్యం, చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని స్వాధీనం చేసుకునేందుకు భారత సైన్యానికి స్వేచ్ఛ, అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయడం, స్వామినాథన్ కమిషన్ ప్రకారం అన్ని పంటలకు ఎమ్మెస్పీని నిర్ణయిస్తామని హామీ ఇచ్చాం. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు, వ్యాపారులకు సులభంగా వ్యాపారం చేయడం, ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదా ఇస్తాం. అవినీతిపరులకు రక్షణ కల్పించే బీజేపీ "వాషింగ్ మెషీన్"ని నాశనం చేయడంలో ఇండియా వేదిక పార్టీలు భాగస్వాములౌతాయని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. ఇండియా వేదికకి బలమైన మూలస్తంభం ఆప్.

మిగతా 3 లో

# హైదరబాద్‌కు తప్పనున్న నీటిగండం..

## భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే జులై వరకు డోకా లేదు

**టి మీడియా, మే 23, హైదరాబాద్:**రాష్ట్ర రాజధాని హైదరబాద్ తాగునీటి గండాన్ని గట్టెక్కించేందుకు ఎల్లంపల్లి జలాశయ అదికారులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల నడుమ గోదావరిపై నిర్మాణమైన ఎల్లంపల్లి మండుతున్న ఎండలతో ఎండి ఎడారిలా మారుతుండటంతో.. ఇన్‌టెక్ కాల్వలకు నీరొచ్చే అవకాశం లేకపోయింది. దీంతో అదనంగా మోటర్లను ఏర్పాటు చేసి కాల్వల్లోకి నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకంలో భాగమైన బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ నుండి రాష్ట్ర రాజధానికి వర్షకాలం వరకు నీటి సరపరా కు డోకా లేనట్లే అంటున్నారు అధికారులు.ఎల్లంపల్లి ఎన్నడూ లేనంతగా అడుగంటి పోయి ఎడారిలా మారి తల్లడిల్లుతోంది. మండుతున్న ఎండలతో అడుగంటుతున్న ఎల్లంపల్లి 2016లో ఏర్పడిన తాగినీటి కష్టాలను పునారావృతం చేసేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 148 అడుగులకు గాను 140.5 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉండటం.. 20 టీఎంసీలకు గాను 5.5 టీఎంసీల నీరు మాత్రమే జలాశయంలో నిల్వ ఉండటంతో డెడ్ స్టోరేజీకి సమీపంలోకి వచ్చి చేరింది. భానుడి భగభగలతో రోజుకు 160 క్యూసెక్కుల నీరు ఆవిరవుతుండగా.. 331 క్యూసెక్కుల నీరు హైదరబాద్ కు తాగునీటి అవసరాల కోసం ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీరు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ నుండి సరపరా అవుతోంది.అయితే బ్రహ్మణపల్లి పంప్ హౌజ్‌కు నీళ్లు చేర్చే ఇన్ టెక్ కాల్వకు సమీపంలో ఎల్లంపల్లి జలాశయ మట్టం 138.5 అడుగులకు పడిపోవడంతో పంప్ హౌజ్ కు నీరు చేరడం గగనమైంది. దీంతో అలర్ట్ అయిన హెచ్‌ఎండబ్ల్యుఎస్ అధికారులు ఎల్లంపల్లి జలాశయంలో వార్ జోన్ ను ఏర్పాటు చేసి, 120 హెచ్ పీ సామర్థ్యం ఉన్న 20 మోటర్ల ను యుద్ద ప్రాతిపదికన బిగించి తాగునీటి కష్టాలకు చెక్ పెట్టే ప్రయత్నం మొదలు పెట్టారు.ఉదయం ఎర్రని ఎండలు.. సాయంత్రం ఒక్కసారిగా చల్లగా మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురుస్తున్నా.. భగీరథ ప్రయత్నాన్ని మాత్రం ఆపడం లేదు సిబ్బంది. అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకం ద్వారా హైదరబాద్ మెట్రోపాలిటిన్ సిటీకి నీరందించే ప్రయత్నం చేస్తున్నారు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ అధికారులు. పంప్ హౌజ్ ఇంఛార్జ్ సతీష్ ఆద్వర్యంలో జలాశయంలో ఎత్తిపోతల ద్వారా నీటిని కాల్వలోకి తరలించదుకు మోటర్లను బిగించే భగీరథ యత్నం చకాచకా సాగుతోంది. 25 సబ్మెర్సిబుల్ పంపులను నదిలో ఏర్పాటుచేసి అప్రోచ్ కాలువలోకి ఎత్తిపోయనున్నారు. జులై చివరి వారం నాటికి ఈ ప్రాజెక్టుకు ఇన్ఫ్లో ప్రారంభమవుతుంది. అప్పటి వరకు అప్రోచ్ కాలువలోకి నీటి ఎత్తిపోత తప్పనిసరని బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ అధికారులు చెప్తున్నారు.2016 లో ఇదే పరిస్థితి ఎదురవడంతో ఆ ఏడాది 16 మోటర్లను నదిలో బిగించి ఇన్ టెక్ కాల్వలోకి ఎల్లంపల్లి జలాలను ఎత్తిపోశారు. ఈ ఏడాది హైదరబాద్ తోపాటు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల మిషన్ భగీరథకు, ఎన్టీపీసీకి అత్యవసర మంచి నీటి సరపరా కోసం 120 హెచ్ పీ సామర్థ్యం ఉన్న మరో నాలుగు అత్యాధునిక సబ్మెర్సిబుల్ పంపులను నదిలో ఏర్పాటుచేసి ఇన్ టెక్ కాల్వలన నింపే ప్రయత్నం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు .ప్రస్తుతం ఎల్లంపల్లి ఇన్‌టెక్ వెల్ వద్ద 138 మీటర్ల మట్టం వద్ద నీళ్లు ఉండగా%ౌ% భగీరథ ప్రయత్నంతో అప్రోచ్ కాలువల లోతును పెంచి ఇన్ టెక్ వెల్ లోకి నీరు వచ్చేలా భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. దీని ద్వారా మంచిర్యాల జిల్లాలోని తొమ్మిది మండలాలకు తాగు నీరందించే మిషన్ భగీరథ ఇన్ టెక్ వెల్ లను 140 మీటర్ల మట్టం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. అందుకోసం జేసీబీల సాయంతో కాల్వలలను తవ్వించి గోదావరిలోని నీటిని పంప్ హౌజ్ లోకి మళ్లించే భగీరథ యత్నం చేస్తున్నారు ఎల్లంపల్లి అదికారులు.ఈ భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే వర్షకాలం ప్రారంభం వరకు ఇటు మంచిర్యాల జిల్లాకు తాగు నీటి గండం తప్పినట్టే..



అటు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ వద్ద సబ్ మెర్సిబుల్ పంపుల బిగింపు పూర్తయితే.. 140 అడుగులున్న గోదావరి నది గర్భం నుంటి పంప్ హౌజ్ అప్రోచ్ కాల్వలోకి నీరు ఎత్తిపోయడం షురూ అయితే రాష్ట్ర రాజదాని హైదరబాద్ జులై మొదటి వారం వరకు నిరంతరాయంగా తాగునీటి సరపరా చేసే అవకాశం ఉంటుంది. ఆలోగా అకాల వర్షాలతో ఒక్క టీఎంసీ వాటర్ వరద రూపంలో జలాశయంలోకి వచ్చినా తాగునీటి గండాన్ని ఈ ఏడాది గట్టెక్కినంటే అంటున్నారు ఎల్లంపల్లి అదికారులు.

### సోనియాకు ఆహ్వానంపై...

# రాజకీయ ప్రకంపనలు

**-గల్లీ టు ఢిల్లీచర్చనీయాంశం**

**-కాంగ్రెస్ నిర్ణయంపై బీజేపీ ఫైర్**



**టి మీడియా, మే 23, హైదరాబాద్:**తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియా వస్తారా? రారా? అంతకంటే ముందే ఈ అంశం ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. సోనియా ఆహ్వానాన్ని బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. తెలంగాణ దేవత అయిన సోనియాను ఎందుకు ఆహ్వానించకూడదని ప్రశ్నిస్తున్నారు అధికార పార్టీ నేతలు.. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియా గాంధీను ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూడు రోజుల క్రితం జరిగినభేటీలో కేబినెట్నిర్ణయించింది. ఈఅంశంఇప్పుడు గల్లీటుఢిల్లీ చర్చనీయాంశంగా మారింది. సోనియాన ు ఆహ్వానించాలన్న ప్రభుత్వనిర్ణయాన్ని ప్రతిపక్షాలుతప్పు బడుతున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్న నిర్ణయాన్ని కమలనాథులు తప్పుబడుతూనే, సోనియాను పిలవడం ఏంటని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అసలు సోనియాను ఏ హొదాలో ఆహ్వానిస్తారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 1500 మందిని బలి తీసుకున్నందుకు సోనియాను ఆహ్వానించి సన్మానిస్తారా అని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా? అంటున్నారు కిషన్ రెడ్డి. ప్రభుత్వ కార్యక్రమమే అయితే పార్టీ అధినేతను ఎలా ఆహ్వానిస్తారు? పార్టీ కార్యక్రమం అయితే గాంధీ భవన్‌లో ఘనంగా సన్మానించుకోవచ్చు అంటూ సెటైర్లు వేశారు కిషన్ రెడ్డి..అయితే కమలనాథులను కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు. సోనియా తెలంగాణ ఇచ్చిన దేవత అంటూ ప్రశంసిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటునే ప్రధాని మోదీ అవమానించారన్న కాంగ్రెస్ నేతలు.. మోదీ నాయకత్వంలో పనిచేస్తే ఇలానే మాట్లాడుతారని కిషన్ రెడ్డిని ఉద్దేశించి విమర్శిస్తున్నారు. సోనియా రాకను తప్పుబడుతున్నారంటే బీజేపీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు ఆ పార్టీ నేత అద్దంకి దయాకర్..ఇదంతా ఇలా ఉంటే ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సైతం బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ చివరి ఏడాదే ఉత్సవాలు నిర్వహించారు, మళ్లీ ప్రత్యేకంగా జరపడం ఎందుకు ప్రశ్నించారు ఆ పార్టీ నేత బూర నర్సయ్య గౌడ్. ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీకి నిధులు లేవు కాని ఉత్సవాలకు ఉన్నాయా అని ప్రశ్నించారు.వేడుకలకు పది రోజుల ముందే మొదలైన ఈ వివాదం టైమ్ దగ్గర పడుతున్నా కొద్దీ ఇంకా ఎలాంటి రాజకీయ వివాదాలకు దారితీస్తోందో చూడాలి.

# నేరాలపై అవగాహన

## ఎస్పీ రక్షిత కె మూర్తి

**టీ మీడియా, మే 23, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి, ఆదేశానిసారం వనపర్తి జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగము వనపర్తి టౌన్ లోని అంబేద్కర్ చౌరస్తా లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగము యొక్క కార్యకలాపాలు, ఈవ్-టీసింగ్ గురించి, మహిళలపై చిన్నారులపై జరుగు నేరాలు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ, సైబర్ నేరాలు మొదలగు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగము ఇంఛార్జి ఎస్ ఐ అంజద్ మాట్లాడుతూ షీ టీం అంటే ఏమిటి? ఇది ఎలా పని చేస్తుంది? షి టీం ను ఎలా సంప్రదించాలి, యు టీజింగ్, హ్యూమన్ ట్రాఫిక్ కింగ్, ఉమెన్ హెల్ప్ డెస్క్ లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం,బాల్య వివాహాలు బాల కార్మికులు సరిహద్దు కార్మికులు ఇంటర్నెట్ భద్రత మా చేతుల్లో ఉంది మీ సమాచారాన్ని రక్షించండి. సైబర్ స్టాకర్లు పిల్లల సైబర్ భద్రతను ఎలా ట్రాప్ చేస్తున్నారో మీ వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయవద్దు

సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవలసిన రక్షణ భద్రత కొలత ల గురించి చిన్నపిల్లలను వెట్టిచాకిరి నుండి బయటపడేసి వారి బాల్యాన్ని అందమైన జీవితంగా మలచుకోవడానికి బాటలు వేయాలని అని తెలిపినారు. అదేవిధంగా ఎవరైనా బాలల చేత పనులు చేయిస్తే వారు బాలకార్మిక చట్టం కింద శిక్షార్హులు అవుతారని, 14 సంవత్సరాలలోపు బాలబాలికలను పనిలో పెట్టుకోకూడదని, అదేవిధంగా గృహాల నందు పిల్లలను ఇంటి పని చేయడానికి పెట్టుకున్నా వారు కూడా ఈ చట్టం కింద శిక్షార్హులు అవుతారని, బాలలు ఎవరైన తమ ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు తెలిస్తే 1098 కి సమాచారం అందించాలని తెలిపారు .బాల్యం ఎంతో మధురమైనదని పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలంటే బాల్యం ఎంతో ముఖ్యమైనదని అట్టి బాల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి పౌరుని పై ఉన్నదని అన్నారు. అలాగే మహిళలను ఉద్దేష్యించి తెలుపుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో పాటు స్త్రీలు సమానంగా పోటీ పడుతున్నారని ఉన్నత చదువులు చదువుకొని ఇంకా ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. ఎలాంటి ఆపద సమయంలో నైనా డయల్100 కు కాల్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని అన్నారు. మహిళలు చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు. మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ మానవ అక్రమ రవాణా



నిరోధక విభాగము ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆకతాయిలు వలన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే మహిళ హెల్ప్ లైన్ 1091/181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098/112, సైబర్ క్రైమ్ 1930 నంబర్లకు ఫోన్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా కానీ ఫిర్యాదులు చేయవచ్చు. ఫిర్యాదును అందుకున్న వెంటనే మానవ అక్రమ రవాణా నిరోధక విభాగము పోలీసులు బాధిత మహిళలకు అండగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



### పారిశుధ్య కార్మికురాలిపై..

# ఫీల్డ్ అసిస్టెంట్ అఘాయిత్యం

**-వీడియో తీసి పైశాచిక ఆనందం..**

టి మీడియా, మే 23, హైదరాబాద్:కామంతో కళ్ళు మూసుకు పోయిన ఓ అధికారి బరితెగించాడు.. ఒళ్ళు మరిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పైగా వీడియో రికార్డు చేసి, వేధింపులకు పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన బల్దియా పరిధిలోని గాజులరామారంలో వెలుగు చూసింది. సర్కిల్‌లో మున్సిపల్ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిషన్.. తన కింద పని చేసే ఓ పారిశుధ్య కార్మికురాలిపై కన్నేశాడు. తాను చెప్పినట్లు వినాలని ఆమెను బెదిరించాడు. అంతేకాదు విధి నిర్వహణలో ఇబ్బందులు పెట్టాడు. అధికారి వేధింపులు భరించలేక నరకయాతన అనుభవిస్తున్న కార్మికురాలు అతని చెరలో పడక తప్పలేదు. రోజు పనికి వచ్చిన ఆమెను ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. అంతటితో ఆగకుండా ఈ తతంగమంతా తన ఫోన్‌లో రికార్డు చేసి.. అవి మళ్లీ మళ్లీ చూస్తూ నేత్రానందం పొందాడు కిషన్.ఈ క్రమంలో కిషన్ లైంగిక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తోటి కార్మికుల ఫోన్‌లో కూడా వీడియోలు ప్రత్యక్షమయ్యాయి. అవన్నీ చూసిన కార్మికులు ఏంటని ప్రశ్నించారు. దీంతో ఎవరికీ చెప్పొద్దంటూ ఒక్కొక్క కార్మికుడికి 10వేల చొప్పున దాదాపు 14 మందికి డబ్బులు ఇచ్చి, వారి నోరు మూయించాడు కామాంధుడు కిషన్. కూకట్‌పల్లి మహిళ ఐఏఎస్ అధికారిణి జోనల్ కమిషనర్ ఉన్న చోట ఈ దారుణం వెలుగు చూసింది. ఆమె పరిధిలో పని చేస్తున్న ఓ మహిళా పారిశుధ్య కార్మికురాలిపై ఇంత దారుణం జరుగుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం విడ్డురంగా ఉందని మహాళా కార్మికులు అంటున్నారు. ఈ లైంగిక వీడియోలు సోషల్ మీడియాలో చూసిన చాలా మంది జి హెచ్ ఎం సి ఉన్నతాధికారులు కూడా కామాందుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం విడ్డూరం..!

### యాత్రికులను మోసం చేసిన

# టిటిడి ఒప్పంద కార్మికులు

**టి మీడియా, మే 23,తిరుమల :** యాత్రికులను టిటిడి ఒప్పంద కార్మికులు మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై టిటిడి విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన యాత్రికులకు స్వామివారి



దర్శన టికెట్లు తీస్తామని లక్ష్మి శ్రీనివాస మన్ పవర్ కార్పొరేషన్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది రూ.20 వేలు తీసుకున్నారు. వారు దర్శన టికెట్లు ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించిన యాత్రికులు టిటిడి విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సిబ్బంది పరారీలో ఉన్నారని వారిని అదుపులోకి తీసుకుని బాధితులకు న్యాయం చేస్తామని టిటిడి విజిలెన్స్ అధికారులు తెలిపారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**టి మీడియా, మే 23,రంగారెడ్డి:** జిల్లా తలకొండ పల్లి మండల పరిధిలోని జగ్గారెడ్డిపల్లి గ్రామ శివారు లో ఈరోజు ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌదర్ పల్లి గ్రామానికి చెందిన మల్లేష్




(35)తన పని నిమిత్తం ఆమనగల్ పట్టణ కేంద్రానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి తన బైక్ పై వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తుంది..జంగారెడ్డి పల్లి గ్రామ సమీ పంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మహేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొన డంతో మల్లేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.మృతునికి భార్య,ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య వరలక్ష్మి గ్రామంలోని అంగన్వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తున్నారు. మృతి చెందిన మల్లేష్ ను పోస్టుమార్టం నిమిత్తం కల్వ కుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తు న్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు..

### చలో మాచర్లకు టిడిపి పిలుపు..

# పోలీసుల అలెర్ట్

**టిడిపి ముఖ్య నాయకులు గృహనిర్భందం**

**-జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని హెచ్చరిక**

**టి మీడియా, మే 23,గుంటూరు :** పల్నాడులో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ సానుభూతిపరులను పరామర్శించేందుకు చలో మాచర్లకు ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. మాచర్లకు వెళ్లకుండా గొల్లపూడిలో దేవినేని ఉమాను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. గుంటూరులో మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, కనపర్తి



శ్రీనివాసరావు ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంది అని చెబుతున్న పోలీసులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. పల్నాడు ప్రాంతంలోని సమస్యాత్మక పట్టణాల్లో పదిరోజులుగా షాపులు మూసివేస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో భారీగా పోలీసులు మోహరించారు. ఇప్పటికీ అక్కడక్కడ చెదురుముదురు ఘటనలు జరుగుతూనే ఉన్నా సంగతి తెలిసిందే.




## బ్రాహ్మణ బంధువులు కు ముఖ్యసమాచారం

**టీ మీడియా పెళ్లి పందిరి విభాగం వద్ద దేశం లోని వివిధ ప్రాంతాల నుండి సేకరించిన 2000వరకు, అన్ని వయస్సు లు, అన్ని రకాల ఆర్థిక స్థాయి లు ఉన్న.. వధువు, వరులు తో పాటు సెకండ్ మ్యారేజ్ వాళ్ళు, విడో వధువు వరుల వివరాలు అందు బాటు లో ఉన్నాయి. మీకు నచ్చిన సమందం మధ్య వర్తు లు లేకుండ మాట్లాడు కోవచ్చు. వివరాలు కు ఇంచార్జి :7382990365కి కాల్ చేయండి.**

మొదటి పేజీ తరువాయి

# తప్పుడు కేసులు పెట్టి జైలులో పెట్టారు

జూన్ 4న ఇండియా వేదిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, మేము ఈ హామీలను సమిష్టిగా నెరవేరుస్తామని నా హామీ.

**ప్ర :మీరు గతంలో శరద్ పవార్, సోనియా గాంధీ వంటి పలువురు నేతలను అవినీతిపరులు అన్నారు. మీరు ఇప్పుడు వారిలో కొందరితో వేదికను పంచుకుంటున్నారు. మార్పును మీరు ఎలా వివరిస్తారు?**

**కేజ్రీవాల్ :** చరిత్రలో ఎన్నడూలేని భారతదేశ ప్రజాస్వామ్యం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 'ప్రతిపక్ష-ముక్త్' భారతదేశం అనే కల కోసం మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ప్రతి సంస్థపై 10 సంవత్సరాలు ఎడతెగని దాడులను మనం చూశాము. ప్రతిపక్ష పార్టీలుగా విభేదాలను లెక్కించడానికి ఇది సమయం కాదు. అందరూ ఏకమై భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి భాగస్వాములు కావాల్సిన సమయం ఇది. ప్రజాస్వామ్యం లేకపోతే, మనం ఏ పార్టీలో ఉన్నామన్నది ఎలా ముఖ్యం అవుతుంది?రష్యాలో ప్రెసిడెంట్ పుతిన్ తన శాశ్వత పాలనను స్థాపించి, ఇటీవలి ఎన్నికల్లో 87% ఓట్లతో ఎలా గెలిచారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఇటీవల 75% ఓట్లు వచ్చాయి. ప్రతిపక్షాన్ని ఎలా తుడిచిపెట్టి గెలిచారు. అదే విధంగా భారతదేశంలో ప్రధాని మోదీ 'వన్ నేషన్, వన్ లీడర్' మిషన్‌ను ప్రారంభించారు. వీరే ప్రధాని మోదీకి ఆదర్శం. భారతదేశంలో ఇది జరగడానికి మనం అనుమతిస్తే, సాధారణ ప్రజల స్వరం లేకుండా పోతుంది. మనకు శాశ్వతంగా ఒకే పార్టీ పాలన మిగిలిపోతుంది. ఇప్పటికే చాలా నష్టం జరిగిపోయినప్పటికీ, అది జరగకుండా నిరోధించడానికి, నియంతృత్వం నుండి మన దేశాన్ని రక్షించడానికి '2024' భారతదేశ ప్రజలకు ఉన్న చివరి అవకాశం.

**ప్ర :ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మీ పార్టీ రెండు నిర్ణయాత్మక విజయాలు సాధించగలిగింది. కానీ ఢిల్లీ నుంచి లోక్‌సభ సీటును గెలుచుకోలేకపోయింది. ఈసారి మీ పార్టీ విధానం దీనికి భిన్నంగా ఉంటుందా?**

**కేజ్రీవాల్ :** ఈసారి రెండు పెద్ద మార్పులు చోటుచేసుకున్నాయి. గత పదేళ్లలో ఆప్ శరావేగంతో అభివృద్ధి చెందింది. దశాబ్దంలో జాతీయ పార్టీగా అవతరించిన మొదటి పార్టీగా అవతరించింది. బీజేపీ, కాంగ్రెస్ తర్వాత రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్న ఏకైక పార్టీ మాదే. మాకు నాలుగు రాష్ట్రాలలో ఎమ్మెల్యేలు ఉన్నారు. భారతదేశం అంతటా స్థానిక సంస్థలకు ఎన్నికైన అసంఖ్యాక సభ్యులు ఉన్నారు. గతంలో లోక్‌సభ ఎన్నికల్లో చిన్న ప్రాంతీయ పార్టీగా పోటీ చేశాం. నేడు మేము జాతీయ శక్తిగా ఉన్నాం. జాతీయంగా ఆకర్షించే పాలనా నమునాను కలిగిఉన్నాం. మరో పెద్ద మార్పు ఏమిటంటే మేము పోరాడడం ఇదే మొదటిసారి.

**ప్ర :మీరు కుల ఆధారిత రిజర్వేషన్లకు మద్దతిస్తారా?**

**కేజ్రీవాల్ :** ఖచ్చితంగా. సమాజంలోని అట్టడుగున నివసిస్తున్న వర్గాలు ప్రధాన స్రవంతిలో ఖాళీలను ఆక్రమించుకోవడానికి కుల ఆధారిత రిజర్వేషన్లు సహాయపడతాయి. ఇది వారి హక్కు. రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్‌ను అంతం చేయాలని భావిస్తున్నందున తమకు 400 ప్లస్ సీట్లు కావాలని సీనియర్ బీజేపీ సభ్యులు బహిరంగంగా చెప్పడం నాకు షాకింగ్‌గా ఉంది. బీజేపీ రాజ్యాంగాన్ని, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గౌరవించడం లేదు. వారు దానిని మార్చడానికి తహతహలాడుతున్నారు. కాని మేము మా చివరి శ్వాస వరకు వారితో పోరాడుతాము.

## యువత సన్మార్గంలో నడవాలి

**౦ తల్లిదండ్రుల పట్ల భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలి**

**౦ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి**



**టీ మీడీయా, మే 23, వనపర్తి బ్యూరో :** పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దమందడి మండలం సమన్వయకర్త తూడి శ్రీనివాస్ రెడ్డి తల్లిదండ్రులు వెంకటమ్మ, సాయిరెడ్డి ల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను ఆయన గురువారం ప్రారంభం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో క్షణక్షణం చాలా విలువైనదని యువకులు విలువైన సమయాన్ని బంగారు భవిష్యత్తు కోసం కేటాయించాలని, ఉన్నతమైన చదువులు, క్రీడల తోపాటు తల్లిదండ్రులను దైవంగా భావించి ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.క్రీడలలో గెలుపు ఓటములు సహజమేనని గెలిచినవారు ఓడినవారు ఎలాంటి బావోగ్వేదాలకు లోను కాకుండా క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఆయన అన్నారు. ముఖ్యంగా యువకులు చెడు మార్గాలకు ఆకర్షితులవ్వకుండా ఉన్నతమైన మార్గాలను ఎంచుకొని భవిష్యత్తులో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు ప్రసాద్, ఖిల్లాగణపురం మండల నాయకులు సాయి చరణ్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు క్రీడాకారులు పాల్గొన్నారు.

## చేతి పంపు మరమ్మత్తు పూర్తి

**టీ మీడియా,మే23,గోదావరిఖని ప్రతినిది::** గోదావరిఖని పట్టణంలోని 47వ డివిజన్ సాధననగర్ లో చేతిపంపు పని చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అసలే వేసవి కాలం కావడంతో నీటి ఎద్దడితో అవస్థలు పడుతున్నారు. కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ మేకల సదానందం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు చేతిపంపు మరమ్మతు పనులు చేయించారు.వెంటనే నగరపాలక సిబ్బందితో చెడిపోయిన చేతి పంపును మరమ్మత్తు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. సమస్యను వెంటనే పరిష్కరించిన స్థానిక కార్పొరేటర్ మేకల సదానందం, నగరపాలక మేయర్, కమిషనర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో డివిజన్ కాంగ్రెస్ నాయకులు రాము, సురేష్, రమేష్,కాలనీ పెద్దలు రాజయ్య, లింగయ్య,కాలనీ వాసులుపాల్గొన్నారు.



## ప్రైవేట్ హాస్పిటల్ తనిఖీ చేసిన

**౦ డిప్యూటీ జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు**



**టీ మీడీయా, మే 23, వనపర్తి బ్యూరో :** పెబ్బేరు మున్సిపల్ పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్ తనిఖీ చేసిన డిప్యూటీ జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు . పెబ్బేరు మున్సిపల్ పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్ లో గురువారం ఒక పత్రిక లో శంకర్ దాదా ఎంబిబిఎస్ పత్రిక కథనం శీర్షికపై తనిఖీ చేసిన డిప్యూటీ జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు ఆ హాస్పిటల్ లో ఉన్న వ్యక్తి గురించి ఆరా తీయగా నేను అందుబాటులో లేను రేపు జిల్లా ఆఫీసుకు వచ్చి వివరణ ఇస్తానని తెలిపినారు, అలాగే హాస్పటల్ సంబంధించిన మేనేజ్మెంట్ వాలు కూడా లేరు. అలాగే ల్యాబ్ రూమ్ లో ఉన్న రిజిస్టర్ లను తనిఖీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి టీబి నియంత్రణ అధికారి డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మధు, ఆరోగ్య విస్తరణ అధికారి అశోక్, హెల్త్ సూపర్వైజర్ నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్ లు రాజశేఖర్, రాజేందర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.


## పాలిటెక్నిక్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

**౦మార్నింగ్ వాక్ లో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**టీ మీడీయా, మే 23, వనపర్తి బ్యూరో :** చారిత్రాత్మక కట్టడమైన పాలిటెక్నిక్ కళాశాలను అన్ని విధాలుగా బాగు చేసుకుందామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.గురువారం ఆయన పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మార్నింగ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మార్నింగ్ వాక్ లో వనపర్తి పట్టణ వాసులను కలిసి మాట్లాడారు.పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న పురాతన బావికి జాలి ఏర్పాటు, ఉదయపు నడక కోసం వాకింగ్ ట్రాక్, రాత్రి సమయంలో కళాశాల ఆవరణలో పూర్తిగా చీకటి ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పట్టణ వాసులు పేర్కొనడంతో స్పందించిన ఎమ్మెల్యే హైమాస్ట్ లైట్లు సైతం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని పరిశీలించారు.కళాశాల పటిష్టత నిర్మాణాల కోసం మంజూరైన నిధులను వెనక్కి వెళ్ళకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో మాట్లాడి నిలుపుదల చేశామని ఆ నిధులతో కళాశాలను పూర్తిస్థాయిలో పటిష్టపరచుకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మార్నింగ్ వాక్ లో ఎంఎల్ఏ పట్టణ వాసులతో కలిసి ఎమ్మెల్యే కాసేపు సరదాగా క్రికెట్ మ్యాచ్, ఫుట్బాల్, షటిల్ బ్యాట్మెంటన్ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, మున్సిపల్ కౌన్సిలర్లు చీరల సత్యం సాగర్, బ్రహ్మం చారి, పట్టణ ప్రముఖ వైద్యులు పగిడాల శ్రీనివాస్ రెడ్డి, రమేష్, బొంబాయి మన్నెంకొండ, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నటి విద్యను దారుణంగా హత్య చేసిన భర్త



**టీ మీడియా, మే23,మైసూర్:** సెన్సేషనల్ మువీ 'భజరంగీ' నటి, కాంగ్రెస్ నేత విద్య (36) సోమవారం రాత్రి దారుణ హత్యకు గురైంది. ఆమెను భర్తే దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణమైన ఘటన మైసూర్‌లోని తన ఇంట్లోనే జరిగింది. అయితే నటి విద్య, నందీష్‌ని 2018లో వివాహం చేసుకుంది. వివాహానంతరం కొద్ది రోజులకే వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. తరచూ ఈ జంట గొడవపడుతుండేది. దీంతో విద్య భర్త నందీష్ విడాకులు తీసుకోవడానికి కూడా ప్రయత్నించాడు. కానీ అతని తల్లిదండ్రులు వారిద్దరినీ కూర్చోబెట్టి మాట్లాడి రాజీ కుదిర్చారు. అయినా వీరిద్దరు గొడవలు పడటం ఆపలేదు. ఈ క్రమంలో తాజాగా వీళ్ళు మళ్ళీ గొడవపడగా%ా% అదికాస్తా.. తారా స్థాయికి చేరుకోవడంతో భర్త నందీష్ విద్యపై సుత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన విద్య అక్కడికక్కడే మృతి చెందింది. కాగా .. భర్త నందీష్ అక్కడినుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు తెలిపారు.

## తల్లి దోసెలు వేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేది

**-ఇప్పుడు కొడుకు కోట్లకు పడగలెత్తాడు - రేవ్ పార్టీ ప్రధాన నిందితుడు స్టోరీ**



**టీ మీడియా, మే23,బెంగళూరు:** కూలికి పోతే కానీ పూట గడవని కుంటుంబం అతనిది.. పూరింట్లో నివాసం.. కానీ ఇప్పుడు కోట్లు ఆర్జించాడు. అరె.. భలే స్ఫూర్తి పొందే స్టోరీ అనుకోకండి. అతని మార్గాన్ని అనుసరిస్తే మీరు కూడా ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుంది. అవును.. అతను ఈజీ మనీ కోసం బెట్టింగ్ దందాలకు పాల్పడ్డాడు. డ్రగ్స్ పెడ్లర్స్‌తో చేతులకు కలిపాడు. కోట్లకు పడగలెత్తాడు. వెయ్యి గుడ్లు తిన్న రాబందు ఒక్క గాలి వానకి కుప్పకూలినట్లు.. ఇప్పుడు బెంగళూరు రేవ్ పార్టీతో అడ్డంగా బుక్కయ్యాడు.ప్రస్తుతం టాలీవుడ్‌ను షేక్ చేస్తోన్న బెంగళూరు రేవ్ పార్టీ కేసుకు సంబంధించి అక్కడి పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడు లంకపల్లి వాసు గురించి విచారించగా విస్తుపోయే విషయాలు వెలుగులోని వస్తున్నాయి. విజయవాడ బ్రహ్మంగారి మఠం వీధికి చెందిన వాసుది పేద కుటుంబం. తండ్రి చనిపోగా.. తల్లి దోసెలు వేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. వాసుకు ఇద్దరు అక్కలు, ఒక అన్నయ్య ఉన్నారు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌లో రాణించాలని కలలుకన్నాడు వాసు. అందుకే ఆటను అవపోసన పట్టాడు. ఆ కళ అతడిని బుకీగా మార్చింది. క్రికెట్, హాకీ, కబడ్డీ ఇలాంటి గేమ్స్ అన్నింటిలో బుకీగా తన హస్తవాసి ప్రదర్శించాడు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలతో పాటు బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో తన నెట్వర్క్ విస్తరించాడు. అనంతరం పలు రాష్ట్రాలకు కూడా తన బెట్టింగ్ సామ్రాజ్యాన్ని విస్తరించాడు. అతడి పనులు చేసి పెట్టేందుకు బెజవాడలో 150 మంది సిబ్బంది ఉన్నారంటే మాటలా. ఆపై పబ్ వ్యాపారంలోకి దిగి.. తన పరిధిని మరింత పెంచుకుంటున్నారు. వాసు భార్య, ఇద్దరు కుమార్తెలు విజయవాడలోనే నివాసం ఉంటారు. అతను మాత్రం నెలకు ఒకటి, రెండు రోజులు వచ్చి వెళ్తాడు. ఎవరైనా అడిగితే విదేశాల్లో జాబ్ చేస్తున్నట్లు కలరింగ్ ఇచ్చేవాడు.అతను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఫ్లైట్ ఎక్కాల్సిందే. టైం అతనికి అంత ఇంపార్టెంట్. వాసుకు రూ.కోటి విలువైన లగ్జరీ కార్లు నాలుగు వరకు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో విల్లాలు, ఇళ్లు, ఫ్లాట్లు కొనుగోలు చేశాడు. ముంబైలో ఓ బిల్డింగ్ అద్దెకు తీసుకుని.. తను బెట్టింగ్ నెట్‌వర్క్‌ను రన్ చేస్తున్నారు. విజయవాడలో అతని మనుషులు పట్టుబడినా తన ఇన్‌ఫ్లూయెన్స్ వాడి బయటకు తీసుకొచ్చేశాడు. బెంగళూరు రేవ్‌పార్టీలో తప్పితే.. ఇంతవరకు ఎక్కడా పోలీసులకు చిక్కలేదు. అయితే అతనికి పలు అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిసింది. గుండెకు స్టంట్ వేసినట్లు చెబుతున్నారు.

## ఫీల్డ్ ఆఫీసర్‌పై సస్పెన్షన్ వేటు

**-పారిశుధ్య కార్మికు రాలు పై లైంగిక వేధింపులు ఘటన**



**టి మీడియా,మే 23,హైదరాబాద్:** గాజులరామారంలో ఫీల్డ్ ఆఫీసర్ కిషన్ లీలలు వెలుగులోకి వచ్చాయి. ఓ మహిళా పారిశుధ్య కార్మికురాలిని లైంగికంగా వేధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధిత మహిళకు సంబంధించిన వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి. దీంతో బాధితురాలు మీడియా ముందుకు వచ్చి జరిగిన విషయాన్ని వెల్లడించింది. మహిళను వేధించిన ఫీల్డ్ ఆఫీసర్‌పై గ్రేటర్ అధికారులు చర్యలు తీసుకున్నారు. కిషన్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. గాజులరామారం ఘటనపై మేయర్ గద్వాల విజయలక్ష్మి స్పందించారు. మహిళా కార్మికురాలిని వేధించడాన్ని సీరియస్‌గా తీసుకున్నామని చెప్పారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు ఆమె ఆదేశాలు జారీ చేశారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే కిషన్‌ను విధుల నుంచి తొలగించారు. కుత్బుల్లాపూర్ పరిధిలో గల గాజులరామారం 25 సర్కిల్ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా కిషన్ పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేసే ఓ పారిశుద్ధ్య కార్మికురాలిపై కన్నేశాడు. తాను చెప్పినట్టు వినాలని, లేదంటే వేధింపులు తప్పవని బెదిరించాడు. ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. ఆ తతంగాన్ని తన ఫోన్‌లో రికార్డ్ చేసేవాడు. అయితూ ఆ వీడియోలు బయటకు రావడంతో కిషన్ ఆగడాలు వెలుగుచూశాయి. ఆ వీడియోలు చూసి ఇతర కార్మికులు కిషన్‌ను ప్రశ్నించారు. అయితే ఎవరికీ చెప్పొద్దంటూ కిషన్ డబ్బు ఆశ చూపాడు.14 మందికి తలా రూ.10 వేల చొప్పున ముట్టజెప్పాడు. అయినప్పటికీ ఆ వీడియోలు వైరల్‌గా మారాయి. దీంతో అతడిపై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు.

## డ్రగ్ టెస్టులో నటి హేమకు పాజిటివ్



**టీ మీడియా, మే23,హైదరాబాద్:** బెంగళూరు రేవ్ పార్టీలో పట్టుబడిన వారిలో 103 మందికి డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్‌గా తేలినట్లు బెంగళూరు పోలీసులు వెల్లడించారు. పలువురు నటుల రక్త నమూనాల్లో మాదకద్రవ్యాల ఆనవాళ్లు లభ్యమైనట్లు తెలిపారు. వారిలో తెలుగు నటి కూడా ఉన్నట్లు చెప్పారు. వారిలో సినీ నటీమణులు హేమ, ఆషీరాయ్, పార్టీ నిర్వహించిన వాసు తదితరులు ఉన్నారు. వారందరికీ బెంగళూరు పోలీసులు నోటీసులు పంపనున్నారు.

## ఎన్నికల ప్రచారంలో కూలిన స్టేజ్

**-ఐదుగురి మృతి**





**టీ మీడియా, మే23,హైదరాబాద్ :** మెక్సికోలో ఓ పార్టీ అధ్యక్ష అభ్యర్థి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో విషాదం చోటుచేసుకుంది. శాన్ పెడ్రో గార్జా గార్షియా పట్టణంలో బుధవారం సిటిజన్స్ మూవ్ మెంట్ పార్టీ బహిరంగ సభ నిర్వహిస్తుండగా ఒక్కసారిగా గాలి దుమారం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టింది. ఈదురు గాలుల తీవ్రతకు స్టేజ్ ఒక్కసారిగా కుప్పకూలింది. భారీ లైట్ సెట్టింగ్ లన్నీ కింద ఉన్న వారిపై పడిపోయాయి. దీంతో సభకు వచ్చిన వారంతా భయంతో పరుగులు తీశారు. ఈ క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ఐదుగురు మృతిచెందారు. మరో 50 మంది గాయపడ్డారు. వారిలో కొందరికి తీవ్ర గాయాలు అయ్యాయని న్యూవో లియోన్ ప్రాంత గవర్నర్ శామ్యూల్ గార్షియా తెలిపారు. ప్రమాద సమయంలో స్థానిక మీడియా సభను ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ప్రమాదవార్త అందిన వెంటనే వైద్య బృందాలు, సైనిక దళాలు రంగంలోకి దిగాయి. చెల్లాచెదురుగా మారిన ఆ ప్రాంతం నుంచి మృతదేహాలను వెలికితీశాయి. క్షతగాత్రులను అంబులెన్సుల్లో ఆసుపత్రులకు తరలించాయి. అయితే సభా వేదికపై ఉన్న సిటిజెన్స్ మూవ్ మెంట్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జార్జ్ అల్వారెజ్ మేనెజ్ అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డారు. తన క్షేమ సమాచారాన్ని 'ఎక్స్' ద్వారా అభిమానులకు తెలియజేశారు. ఈ ప్రమాదం నేపథ్యంలో మిగిలిన ప్రచార కార్యక్రమాలను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు.

## పోలీసుల అత్యుత్సాహం

**-నేరుగా ఆసుపత్రిలోకి జీపు**



**టి మీడియా, మే 23,ఉత్తరాఖండ్ :**ప్రశాంతంగా ఉన్న ఓ ఆసుపత్రిలోకి పోలీసులు వాహనంతో సహా దూసుకువచ్చింది. దీంతో కొద్ది నిమిషాల పాటు ఆస్పత్రిలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా సీన్‌ను తలపించే ఈ ఘటన ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఒక మహిళా వైద్యురాలిని వేధించాడు. ఆ నిందితుని చర్యను నిరసిస్తూ ఆసుపత్రి వైద్యులు, ఇతర సిబ్బంది డీన్ కార్యాలయాన్ని చుట్టుముట్టి, నిరసనలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు ఆసుపత్రికి తమ వాహనంలో చేరుకున్నారు. ఈ సమయంలో వారు సినిమా తరహాలో వాహనంతో సహా ఆసుపత్రిలోకి దూసుకువచ్చారు. జీపుకు దారి కల్పించేందుకు రోగుల స్ట్రెచర్లను తొలగించారు. నిందితుడిని అరెస్టు చేశారు. అయితే ఇంతకీ పోలీసులు.. నిందితుడిని పట్టుకునేందుకు వాహనంతో సహా లోనికి ఎందుకు వచ్చారన్నది తెలియాల్సి ఉంది.

## వైశాఖ పూర్ణిమతో అసాధారణ శక్తి చైతన్యం

**-ఆలయ వేద పండితులు రవిశంకర్ అవధాని**



**టీ మీడియా, మే23, మహానంది:**వైశాఖ పూర్ణిమ అసాధారణ శక్తి చైతన్యాన్ని ప్రసాదిస్తుందని వేద పండితులు రవిశంకర్ అవధాని పేర్కొన్నారు. గురువారం మహానంది పుణ్యక్షేత్రంలో వైశాఖ పూర్ణిమను పురస్కరించుకొని ప్రత్యేక హెూమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవదారాధనతో మనిషి మహెూన్నతుడుగా మారుతున్నారన్నారు. ఆశ్వీయుజ, కార్తిక, మాఘ, వైశాక పూర్ణిమలు ఎంతో విశిష్టమైనవని, ఒక్కో పూర్ణిమ ఒక్కో రీతిన దైవాన్ని పూజించి, ఉత్తమ ఫలితాలు పొందడానికి వీలుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పేద పండితులు నాగేశ్వర శర్మ, శాంతారాంభట్, హనుమంతరాయ శర్మ లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్నమయ్య జయంతి ఉత్సవాలు



**టీ మీడియా, మే23, మహానంది:** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అన్నమాచార్యులు 616 వ జయంతి ఉత్సవాలు భజన బృందాల నంద్యాల జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విజయ శంకర స్వామీజీ ఆశీస్సులతో ముందుగా అన్నమయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి, వారి రాసిన సంకీర్తనలు పాడుతూ భజన చేసి భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భజన బృందాల జిల్లా సమన్వయ కమిటీ కార్యదర్శి టి రామచంద్రుడు మాట్లాడుతూ 616 సంవత్సరాల క్రితం కడప జిల్లా, రాజంపేట మండలం తాళ్లపాక గ్రామంలో జన్మించిన అన్నమయ్య వారు బాల్య దశ నుండే పాటలు పాడే కళాకారుడు. విద్య పట్ల ఆసక్తి కనబరచని, అన్నమయ్య వారు శ్రీ వెంకటేశ్వర స్వామి పట్ల ఆకర్షితుడై , తన పద కవితలను పాటలను సందర్భానుకూలంగా రాస్తు ,పాడుతూ ప్రజలందరి మన్ననలు పొందారు. క్రమేపీ తన జీవితాన్ని తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి కి అంకితం చేసి వెంకటేశ్వర స్వామి వారి లీలలను పద కవిత్వం, పాటలు, జానపదాలు, సంకీర్తనలు, భజనలు చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో టంగుటూరి ఆస్థానంను పరిపాలిస్తున్న సర్వ నరసింహరాయలు వారు తమ స్వీయ చరిత్ర ను వ్రాసి, పాడమని అడగగా అందుకు నిరాకరించిన అన్నమయ్యను చెరసాలలో బంధించారు. అయినా ఏ మాత్రం జింకకుండా తనలోని కళా చైతన్యం పరిజ్ఞానం వ్యక్తిగత అభివృద్ధి కోసం వాడుకోనని కేవలం వెంకటేశ్వర స్వామి వారి అభివృద్ధి కోసమే , సమాజాభివృద్ధవాడుతానని చెప్పడ న్నారు. సమాజంలో మనుషులంతా ఒకటే నని కుల మత, వర్గ తేడాలు లేవని చాటిన కళాకారుడు అన్నమయ్య.. సుమారు 38 వేల సంకీర్తనలు వ్రాసిన, మధ్య కవితలు, భజనలు, జానపదాలు వ్రాయడమే కాకుండా, లయబద్ధంగాపాడిన మొదటి వాగ్గేయకారుడు, పద కవిత పితామహుడు అను బిరుదు కలిగిన గొప్ప కళాకారుడు అన్నమయ్య. ఆయన స్ఫూర్తితో నేటి సమాజంలో ఉన్న ప్రజలందరూ సమాజ అభివృద్ధి కోసం పాటుపడే విధంగా చైతన్యం కలిగించుటకు కళ లను,కళాకారులను, ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో దేవాలయం వద్ద నిత్యం భజనలు జరిగే విధంగా ప్రోత్సహించాలని, మన జిల్లాలోని సుప్రసిద్ధ క్షేత్రమైన మహానందిలో అన్నమయ్య కళాక్షేత్రం ఏర్పాటుచేసి కళాభివృద్ధికి పాలకులు ప్రోత్సాహం కలిగించే విధంగా తామందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజనగరం వెంకటసుబ్బయ్య, జానపద భజన బృంద కళాకారులు వెంకటసుబ్బమ్మ, వెంకటగిరి మద్దిలేటి, వెంకటేశ్వర్లు, టైలర్ మద్దిలేటి, వెంకటసుబ్బయ్య, గ్రామ పెద్దలు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు మోక్షం ఎప్పుడో

**- పట్టించుకోని నాయకులు**





**టీ మీడియా, మే 23, వనపర్తి బ్యూరో :** జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి ఇంటి లైన్ లో ఉన్న రోడ్డు పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. ఇది దాదాపు కొన్ని సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డు పరిస్థితి గురించి పట్టించుకున్న నాథుడే లేదు. రోడ్డు మొత్తం గుంతలు పడి ఈ దారిలో ప్రయాణం అంటేనే నరకాన్ని తలపించేలా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డుపై మీదుగా ఆంధ్ర బ్యాంక్, డెంటల్ హాస్పిటల్, రేడియంట్ హైస్కూల్, శ్రీ చైతన్య ఒకేషనల్ కాలేజ్, సాయి రత్న హాస్పిటల్, ఆహా హెూటల్, బస్ డిపో మీదుగా ఆర్డీఓ మండల కార్యాలయం కోర్టు కార్యాలయానికి ప్రజలు నిత్యం వాహనాలలో, కాలినడకన రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రోడ్డు సక్రమంగా లేక దుమ్ము దూళికి భరించలేక ముక్కు మూసుకొని వెళుతూ ఉంటారు. చాలామంది ప్రయాణికులు గుంతల కారణంగా ప్రమాదాలకు గురైన సందర్భాలు చాలానే ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని అక్కడ స్థానిక ప్రజలు, చుట్టుపక్కల ఇండ్ల ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం సుమారు వందల ప్రజలు, ప్రయాణీకుల రాకపోకలు సాగిస్తుంటారు. ఇటుగా రావాలంటే ప్రయాణికులు ఈ గుంతలు చూసి ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం అంటే నరకయాతన స్థానికులు, ప్రయాణీకుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సత్వరమే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు.

## నిర్మల్ జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

**-ఇద్దరు మృతి! 25 మందికి తీవ్రగాయాలు**



**టి మీడియా, మే 23, నిర్మల్:** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహబూబ్ ఘాట్స్ వద్ద బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తున్న ముస్కాన్ ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి! 25 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న ముస్కాన్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్ల బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్‌తో కలిపి 50 మంది ప్రయాణికులు ఉన్నారు. సమాచారం అందుకున్న సారంగాపూర్ పెట్రోకార్ పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ మనోజ్, రాణాపూర్ గ్రామస్థులు క్షతగాత్రులను 108 వాహనాల్లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో 25 మందికి గాయాలు కాగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ హైదరాబాద్ తరలిస్తుండగా అదిలాబాద్ పట్టణానికి చెందిన ఫర్హానా (28) అనే మహిళతోపాటు మరొకరు మృతి చెందారు. క్షతగాత్రులను నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. బుధవారం రాత్రి 10:20 కు ఆదిలాబాద్ నుండి హైదరబాద్‌కు బస్సు బయలు దేరింది. అయితే బస్సు స్టార్ట్ అయినప్పటి నుంచే డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సుల నడుపుతున్నట్లు బాధితులు తెలిపారు. దీంతో గంటన్నరలోనే ప్రమాదం జరిగింది. డ్రైవర్ పై పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రైవేట్ బస్సు బోల్తా..

**-ఇద్దరు చిన్నారుల మృతి**



**టి మీడియా, మే 23,కోడుమూరు :** హైదరాబాద్ నుంచి ఆదోని వెళుతున్న ఓ బస్సు ప్రమాదానికి గురైంది. ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందిన ఈ బస్సు కర్నూల్ %-% కోడుమూరు సమీపంలో బోల్తా పడింది. బస్సు డ్రైవర్ అతి వేగంగా వెళ్తూ మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం గమనించిన గ్రామస్థులు వెంటనే స్పందించారు. బస్సులో చిక్కుకున్న వారిని వెలుపలికి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని గాయపడ్డ ప్రయాణికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతులు లక్ష్మీ(13), గోవర్ధిని(8) హైద్రాబాద్ వాసులుగా గుర్తించారు. బోల్తా పడ్డ బస్సును క్రేన్ సాయంతో సరిచేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రమాదానికి కారణం గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కుమారుని స్మృతిలో అన్నదానం

**టీ మీడియా, మే23, గోదావరిఖని ప్రతినిధి :**చేతికి అంది వచ్చిన చెట్టంత కొడుకులు ఇద్దరినీ వారం రోజుల వ్యవధిలోనే కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ..




తమ కుమారుల జయంతులను, వర్ధంతులను పురస్కరించుకొని గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏటా దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామిల్ల రామలింగం-మంగళ దంపతులు స్ఫూర్తి ప్రదాతలని ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కే.స్వామి, సీనియర్ జర్నలిస్ట్ దయానంద్ గాంధీ, ప్రముఖ కళాకారులు మేజిక్ రాజా అభినందించారు. స్థానిక మార్కండేయ కాలనీకి చెందిన రామిల్ల రామలింగం-మంగళ దంపతుల కుమారుడు శైలేంద్ర కుమార్ మూడు సంవత్సరాల క్రితం కరోనాతో మృతి చెందగా, ఆయన 3వ వర్ధంతిని పురస్కరించుకొని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గురువారం విఠల్ నగర్ లోని అమ్మ పరివార్ ఆశ్రమంలోని పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాల్సిన వయసులో మూడు సంవత్సరాల క్రితం నెల రోజుల వ్యవధిలోనే రామలింగం-మంగళ దంపతుల ఇద్దరు కుమారులు కరోనా కాటుకు మృత్యువాత పడడం విచారకరమన్నారు. వారి జ్ఞాపకాలలో గత మూడు సంవత్సరాలుగా వారి కుటుంబ సభ్యులు ప్రతిఏటా దివంగతులైన తమ కుమారుల జయంతులు, వర్ధంతులను పురస్కరించుకొని దాతృత్వ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తమ పుట్టినరోజులు, పెళ్లిరోజులు, తమ కుటుంబ సభ్యుల జయంతులు, వర్ధంతులను ఆర్భాటంగా చేసుకోవడంకాక, ఆపన్నులకు వితరణ చేసే కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామలింగం కుటుంబ సభ్యులు శైలజ, రాజేంద్ర కుమార్, జ్యోతి, మహేంద్ర కుమార్, సుప్రియ, వైష్ణవి, విశ్వజిత్, వసుష్ణ, నిత్య సాయి, మాస్టర్ రామిల్ల రవీంద్ర కుమార్, క్రితిక్, గురుపాదంతో పాటు సంస్థ నిర్వాహకులు నాగరాజు, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దారుణ హత్యకు గురైన బిఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి

- పరామర్శించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.
- మాజీ ఎమ్మెల్యే బిరం.





**టీ మీడియా మే 23 చిన్నంబావి:** మండల పరిధిలోని లక్ష్మీపల్లి గ్రామం లో కొల్లాపూర్ మాజీ శాసన సభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి,ప్రధాన అనుచరుడు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మీపల్లి శ్రీధర్ రెడ్డి,దారుణ హత్యకు గురయ్యాడు.శ్రీధర్ రెడ్డి హత్య తో ఒక్క సారి గా మండలం ఉలిక్కి పడ్డట్టు అయింది. వివరాల్లోకి వెళితే బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి (50) దాదాపు రాత్రి రెండు,మూడు గంటల సమయం లో గుర్తు తెలియని దుండగులు కరెంటు తీసి గొడ్డలి తో, వేట కొడవలి తో అత్యంత దారుణం గా నరికి చంపారు.విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అభిలాష్ రావు,సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని చిన్నంబావి మండల కేంద్రం నుండి శ్రీధర్ రెడ్డి,భౌతికయాన్ని పాదయాత్ర గా లక్ష్మీపల్లి గ్రామాని కి తీసుకెళ్ళారు.శ్రీధర్ రెడ్డి,నివాసానికి ర్యాలీగా వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి,హత్య ప్రభుత్వ హత్య గా భావిస్తున్నాం,కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది పేరు కేమో ప్రజా పాలన,చేస్తున్నది ప్రతీకార పాలన అని ఆయన విమర్శించారు.తెలంగాణ లో గతం లో ఎక్కడ లేని ఫ్యాక్షన్ సంస్కృతి నీ కొల్లాపూర్ కు తెచ్చి నాలుగు నెలల్లోనే ఇద్దరు నేతలను దారుణంగా హత్య చేశారని అన్నారు.ఈ హత్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా వేల సంఖ్యలో తరలివెళ్తాం అక్కడి నాయకుల ఇండ్లను ముట్టడిస్తాం అని అన్నారు.నిందితులు ఎంతటి వారైనా వారి పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శ్రీధర్ రెడ్డి,హత్యలో సాక్షాత్తు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, హస్తం ఉందని తల్లిదండ్రులు వాపోయారు.శ్రీధర్ రెడ్డి,కి వ్యక్తిగతంగా ఎలాంటి తగాదాలు లేవని చుట్టుపక్కల గ్రామాలలో మంచి పేరు కలిగి ఉన్నాడని వారు అన్నారు.ఈ హత్య వెనకాల రాజకీయ కుట్ర ఉందని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారి లో కేటీఆర్,తో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు,ఆలా వెంకటేశ్వర్ రెడ్డి,స్థానిక నాయకులు జడ్పిటిసి వెంకట్రామమ్మ, ఎంపీపీ సోమేశ్వరమ్మ,పాన్గల్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, వీపనగండ్ల ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,చిన్నారెడ్డి,తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## చత్తీస్ గడ్ లో మరో ఎన్ కౌంటర్

### - ఏడుగురు నక్సలైట్లు మృతి



**టీ మీడియా, మే23,దంతేవాడ :**ఛత్తీస్ గఢ్ లో మరోసారి భారీ ఎన్ కౌంటర్ జరిగింది. గత రెండు నెలల వ్యవధిలో ఛత్తీస్ గఢ్ లో జరిగిన మూడో ఎన్ కౌంటర్ ఇది. ఈ ఎదురుకాల్పుల్లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందారు. 12 మందికి పైగా మావోయిస్టులు గాయపడ్డారు. దండకారణ్యంలో మావోయిస్టులు కీలక సమావేశం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. దంతేవాడ-బీజాపూర్ సరిహద్దుల్లో భద్రతా బలగాలు కూంబింగ్ చేస్తుండగా, మావోలు కాల్పులు జరిపారు. భద్రతా బలగాలు కూడా దీటుగా స్పందించి ఎదురు కాల్పులతో బదులిచ్చాయి. ఉదయం మొదలైన ఈ ఎన్ కౌంటర్ ఇప్పటికీ కొనసాగుతున్నది. కాగా, పారిపోయే ప్రయత్నంలో ఉన్న పలువురు మావోయిస్టులను భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

## రోడ్డు వేయండి మహాప్రభూ..
## నీటి కుంటలో మహిళ నిరసన..



**టీ మీడియా, మే23,నాగోల్:** నాగోల్ బండ్లగూడ ఆనంద్ నగర్ చౌరస్తాలో కుంట్లూర్ కు చెందిన నిహారిక అనే మహిళ (గురువారం) తెల్లవారుజామున కురిసిన వర్షానికి పాడైన రోడ్డు గుంటలో నిలిచిన వర్షపు నీటిలో కూర్చొని వినూత్న నిరసన తెలిపింది. చాల కాలం నుంచి రోడ్డు పాడై పోయి ఉందని దీనిని పట్టించుకునే వారే లేరని ఈ వర్షాలకు రోడ్డు మరింత పాడయ్యిందని%ొ%.. రాత్రి వేళలో పాదాచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని మహిళా ఆవేదన వ్యక్తం చేసింది.ఈ రోడ్డు గుండానే ఓఆర్ఆర్ కు భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో చేరుకుంటాయని ఏ క్షణానానా ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పాదచారులు బిక్కు బిక్కుమంటూ నడక సాగిస్తారని వాపోయారు. ఇటీవల ప్రమాదాలు కూడ జరిగి కొందరి ప్రాణాలు కూడ పోయాయని పేర్కొన్నారు.వెంటనే, కొత్త రోడ్డు వేయాలని, రోడ్డుపై నిలిచిన నీటిలోనే కూర్చొని నిరసన తెలిపింది. మహిళలకు ట్రాఫిక్ పోలీసులు నచ్చ చెప్పిన వినలేదు. జిహెచ్ఎంసి అధికారుల, ప్రజాప్రతినిధులు నుండి స్పష్టమైన హామీ ఇస్తేనే నిరసన విరమిస్తానని భీష్మించుకుని కూర్చుంది.

**ఘటన స్థలానికి చేరుకున్న కార్పొరేటర్..**

విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఘటన స్థలానికి చేరుకుని ఇది వరకే ఈ రోడ్డు విషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడామని శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల సందర్బంగా, ఎన్నికల కోడ్ కారణంగా, మరికొన్ని కారణాలతో పని ఆలస్యమైనదని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగ సర్కిల్ జీహెచ్ఎంసీ ఏఈ రాకేష్ సిబ్బందితో చేరుకొని కొన్ని గుంతలను కంకరతో నింపి పూడ్చారు. సాధ్యమైనంత త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## రూ.30 లక్షల విలువైన నకిలీ విత్తనాలు పట్టివేత



**టీ మీడియా, మే23,తుర్కపల్లి :**అక్రమంగా తరలిస్తున్న నకిలీ విత్తనాలను ఎస్వోటీ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నకిలీ విత్తనాలతో పాటు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జీనోమ్వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది..కర్ణాటక నుంచి మంచిర్యాలకు వాహనంలో అక్రమంగా నకిలీ విత్తనాలను తరలి స్తున్నారనే సమాచారం మేరకు ఎస్వోటీ పోలీసులు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి రాజీవ్ రహదారిపై తనిఖీలు చేపట్టారు. సుమారు రూ.30 లక్షల విలువ చేసే విత్తనాలతో పాటు రవాణ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## మహానందిలో ఇన్కమ్ టాక్స్ కమిషనర్ పూజలు



**టీ మీడియా, మే23, మహానంది:** పుణ్యక్షేత్రంలో తిరుపతి ఇన్కమ్ టాక్స్ కమిషనర్ దుర్గేష్ సమ్రూత్ గురువారం పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లకు, అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఈవో స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## గుండెపోటుతో ఉపాధి హామీ కూలి మృతి



**టీ మీడియా, మే23, మహానంది:** మండలం అబ్బీపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వ్యక్తి గురువారం గుండెపోటుతో మృతి చెందారు. సంపంగి రవిశేఖర్ (45)ఉపాధి హామీ పనులు నిర్వహిస్తుండగా, అస్వస్థకు గురై పడిపోయారు. వెంటనే అక్కడి సహచర కూలీలు, బంధువులు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రాథమిక చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మహానంది ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో మనోహర్ వెళ్లి మృతిని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఘటనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం ద్వార తగు సహాయం వచ్చేలా చేస్తామని తెలిపారు.

## అస్వస్థత లేదు..ఎం లేదు..

### -క్లారిటీ ఇచ్చిన ఎమ్మెల్యే కొడాలి నాని



**టీ మీడియా మే23,హైదరాబాద్ :** ఏపీ మాజీ మంత్రి, వైసీపీ గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని తీవ్ర అస్వస్థతకు గురయ్యారని.. ఆయన స్వగృహంలో నందివాడ మండల వైసీపీ నాయకులతో మాట్లాడుతూ.. సోఫాలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారని వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. అప్రమత్తమైన నేతలు, గన్మెన్లు సపర్యలు చేసి.. డాక్టర్లకు సమాచారం అందించారని.. ఈ ఘటన జరిగినప్పుడు కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేరని ఇలా రకరకాల వార్తల వినిపించాయి. దీంతో తాను ఎలాంటి అస్వస్థతకు గురి కాలేదని తాజాగా క్లారిటీ ఇచ్చారు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని. తాను బాగానే ఉన్నానని వీడియో రిలీజ్ చేశాడు ఎమ్మెల్యే కొడాలి నాని.. నాని అస్వస్థతకు గురయ్యారని కొంత సేపటి క్రితం వార్తల వైరల్ కావడం గమనార్హం.

## కెమికల్ ఫ్యాక్టరీలో పేలిన బాయిలర్

### - నలుగురు దుర్మరణం



**టీ మీడియా మే23,థానే:**మహారాష్ట్ర థానే డొంబివాలిలో ఉన్న ఓ కెమికల్ ఫ్యాక్టరిలోని బాయిలర్లో గురువారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఫ్యాక్టరిలో భారీగా మంటలు చెలరేగాయి. పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. భారీగా ఎగిసిన పడిన మంటలు మరో రెండు బిల్డింగ్లకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. 25 మంది గాయపడ్డారు.దీంతో సమాచారం అదుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలాని?కి చేరుకొని 15 ఫైర్ ఇంజన్లతో మంటలు ఆర్పుతున్నారు. ఫ్యాక్టరి భవనంలో చిక్కుకున్న 8 మందిని సురక్షితంగా రెస్క్యూ చేసి పోలీసులు కాపాడారు. ఈ ప్రమాదంలో పలు వాహనాలు, పక్కనే ఉన్న కొన్ని ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## ముగిసిన ప్రచారం

### -ప్రజలకు సోనియా గాంధీ కీలక విజ్ఞప్తి



**టీ మీడియా మే23,ఢిల్లీ :** ఆరవ దశ ఎన్నికల ప్రచారం నేటితో ముగిసింది. మే 25న ఆరో విడత ఎన్నికల్లో భాగంగా ఢిల్లీలోని ఏడు లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరగబోతోంది.ఈ క్రమంలో కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ ఢిల్లీ ఓటర్లను ఉద్దేశించి వీడియో సందేశంలో ప్రసంగించారు. ఈ నేపథ్యంలో వీడియో సందేశంలో ఆమె మాట్లాడుతూ.. " మీ ప్రతీ ఓటు ఉపాధిని సృష్టిస్తుంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గిస్తుంది. మహిళలకు సాధికారతను కల్పిస్తుంది" అని ఆమె తెలిపారు. ఇవి అత్యంత కీలమైన ఎన్నికలని, ఈ ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే ఎన్నికలని అన్నారు. లోక్ సభ ఎన్నికలలో ఢిల్లీ ప్రజలు తమ వంతు పాత్ర పోషించాలని ఆమె కోరారు. మీ ఓటు సమానత్వంతో కూడిన భారతదేశాన్ని సృష్టిస్తుంది" అని ఆమె అన్నారు. కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి అభ్యర్థుల్ని భారీ ఓట్లతో గెలిపించాలని ఇండియా కూటమికి ఓటేయాలని ప్రజల్ని సోనియా గాంధీ విజ్ఞప్తి చేశారు.కాగా, ఢిల్లీలో 7 నియోజకవర్గాల్లో గత రెండు సార్లు బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. ఈ సారి ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేస్తున్నాయి. చాందినీ చౌక్, ఈశాన్య ఢిల్లీ మరియు నార్త్ వెస్ట్ ఢిల్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేస్తుండగా,మిగిలిన 4 స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తోంది.

## ముగిసిన ఇరాన్ అధ్యక్షుడి అంత్యక్రియలు



**టీ మీడియా మే23,ఢిల్లీ :** హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ భౌతికకాయానికి పూర్తి అధికార లాంచనాలతో నేడు టెహరాన్ లో అంత్యక్రియలు జరిగాయి. ఇరాన్ వ్యాప్తంగా వేలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భారత్ తరుపును దేశ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కూడా హాజరై రైసీకి నివాళులు అర్పించారు. ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడు మహ్మద్ ముఖ్బన్ని కలుసుకుని సంతాపం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే రైసీ అంత్యక్రియలకు హమాస్, హౌతీ, హిజ్బుల్లా మిటిటెంట్ సంస్థల లీడర్లతో పాటు తాలిబాన్ లీడర్లు హాజరయ్యారు. టెహ్రాన్లో జరిగిన ఈ అంత్యక్రియాలకు తాలిబాన్ ఉప ప్రధాని ముల్లా బరాదర్, హమాస్ రాజకీయ నాయకుడు ఇస్మాయిల్ హనియే, ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ మిలిటెంట్ గ్రూప్ ప్రతినిధులు హాజరయ్యారు. వేలాదిగా ఇరాన్ ప్రజలు హాజరైన ప్రార్థనలకు ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నాయకత్వం వహించారు.

## రెండు కోట్లతో జ్యోతిష్యుడు పరారీ

### -బాధితులు పోలీసులు, ఉద్యోగులు ...?



**టీ మీడియా మే23,వేములవాడ :**ఆశ అనేది ఎంత పనైనా చేయిస్తుంది అని తెల్పడానికే ఈ సంఘటనని ఒక నిదర్శనం.. వేములవాడ పట్టణంలో ఓ జ్యోతిష్యుడు అందరితో సఖ్యంగా, నమ్మకంగా ఉంటూ జ్యోతిష్యం చేస్తూ పూజలు, అభిషేకాలు జాతకాలు చెప్తూ ఆయన దగ్గరికి వచ్చే వారి నమ్మిస్తూ అధిక వడ్డీ ఆశ చూపుతూ పూజారి రూ.2 కోట్లు వసూలు చేసి, ఆ డబ్బుతో పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు ఆయన ఉండే నివాసానికి వెళ్లి ఆరా తీయడంతో ఈ సంఘటన హాట్ టాపిక్ గా మారింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్ వీధిలో మహేష్ అనే అమ్మ భవాని పూజారిగా, శివ సాయిరాం జ్యోతిష్యాలయం నిర్వహిస్తూ జ్యోతిష్యం చెబుతుండేవాడు. ఆయన దగ్గరికి వచ్చే వారితో నమ్మకంగా ఉంటూ మరికొందరు స్నేహితులు, బంధువులు, నమ్మకస్తుల దగ్గర వారి నుంచి డబ్బులు ఇచ్చి పుచ్చుకోవడం చెల్లింపులు సజావుగా సాగాయి. నమ్మిన వారి దగ్గర రెండు లక్షల నుండి సుమారు 40 లక్షల వరకు ఇచ్చినవారు దగ్గర నుండి రెండు కోట్ల వరకు వసూలు చేశాడు. ఇచ్చిన వారిలో స్థానిక నాయకులు, పోలీసులు, ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. రెండు కోట్ల వరకు వసూలు చేసిన మహేష్ ఆ డబ్బుతో ఈ నెల మూడో తారీకు నుండి కనిపించకపోవడం, ఫోన్ స్విచ్ ఆఫ్ రావడం, ఆయన ఉంటున్న శివ సాయిరాం జ్యోతిష్యాలయంలో ఇంట్లో ఉండకపోవడంతో అనుమానం కలగడంతోగత వారం రోజుల క్రితంబాధితులు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కు మొరపెట్టుకొని ఫిర్యాదు చేశారు. రెండు కోట్లతో ఉ డాయించినచ్చిన మహేష్ ని పట్టుకొని చట్టపరంగా శిక్షించాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు. మహేష్ లాంటి వారిని నమ్మి అధిక వడ్డీ వస్తుందని ఆశపడి మోసపోవద్దని పోలీసులు అంటున్నారు.

## చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించే విద్యాలయాలే

### -ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ..




**టీ మీడియా, మే23, మహానంది:**విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించేవిద్యాలయాలే శ్రీ సరస్వతి విద్యాపీఠం అని మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.నంద్యాలలోని శ్రీ రామకృష్ణ పిజి కళాశాల నందు విద్యా భారతి ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో ఆచార్య ప్రశిక్షణ 2024 శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 174 సరస్వతీ విద్యాపీఠం నుండి 32 మంది ఆచార్య,మాతాజీలు శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశాన్ని మహానంది ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులతో చదువుతోపాటు సంస్కారాన్ని అందించేది పాఠశాలలు సరస్వతి విద్యాపీఠాలే అని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులను బంధువులను పలకరించే స్థితిలో నేటి యువత లేదని, పాఠశాల ద్వారా విద్యార్థుల్లో హిందూ ధర్మాన్ని,భారతీయ సంస్కృతిని వ్యాపించేందుకు విద్యా భారతి ఎనలేని కృషి చేస్తుందని కొనియాడారు. మహానందిలో గిరిజనలు వారి పిల్లల కోసం విద్యా భారతి ఒక పాఠశాల ఏర్పాటు చేయాలని, మహానంది ఆలయ ఈవో విజ్ఞప్తి చేశారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో, విద్యా భారతి శ్రీ సరస్వతీ శిశు మందిరాల ద్వారా, దేశవ్యాప్తంగా చేసిన కృషి ఎనలేనిది అని కొరియాడారు. కార్యక్రమంలో విద్యా భారతి కార్యవర్గ సభ్యులు,ప్రముఖులు పాల్గొన్నారు.

## మహానందిలో భక్తుల రద్దీ



**టీ మీడియా, మే23, మహానంది:** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీతో కళకళలాడింది. వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులే కాక, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో మహానందికి తరలివచ్చారు. తెల్లవారుజామునే భక్తులు కోనేరులలో పుణ్య స్థానాలు ఆచరించి, శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా,ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## క్రమశిక్షణ ,పట్టుదల , ఉన్నతికి తొలిమెట్టు

### -కౌటిల్య ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు ఎన్ఎస్ రెడ్డి



**టీ మీడియా మే23, మహానంది:**క్రమశిక్షణ పట్టుదల వ్యక్తిత్వ వికాసంతో మనిషి ఉన్నతికి తొలిమెట్టుగా ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరుపతికి చెందిన కౌటిల్య ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు ఎన్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. మహానంది ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో తొలి ఏడాది వ్యవసాయ విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లక్ష్యానికి చేరువ కావడం ఎలా, సామర్థ్యాలను ఎలా పెంపొందించుకోవాలి, మనం ఎలా ఉండాలి, కెరియర్ను సాధించుకోవడం ఎలా, వ్యవసాయంలో ప్రాధాన్యతలు వాటిని అధికమించడానికి కాబోవు శాస్త్రవేత్తలుగా రైతన్నలకు మేలైన రకాల విత్తనోత్పత్తులు అందించటానికి అనుసరించాల్సిన విధానాలను విపులీకరించారు. ఈ కార్యక్రమంలో మొదటి సంవత్సరం పీజీ విద్యార్థులు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

**సేంద్రీయ ప్రకృతి సేద్యంతో నేల తల్లిని కాపాడుకుందాం.**

-అసోసియేట్ డీన్ డాక్టర్ జయలక్ష్మి, అగ్రనమి ప్రొఫెసర్ శ్రీనివాస రెడ్డి

సేంద్రీయ ప్రకృతి సేద్యంతో నేల తల్లిని కాపాడుకుందాం అని అసోసియేట్ దీని డాక్టర్ జయలక్ష్మి అగ్రనమి ప్రొఫెసర్ శ్రీనివాస రెడ్డిలు పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగినా ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఇంచార్జ డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో తమ్మడపల్లె, ఎర్రగుంట్ల గ్రామాల ఎస్సీ, ఎస్టీ రైతులకు వానపాములతో సేంద్రీయ ఎరువుల తయారీ పై శిక్షణలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేలతల్లిని కాపాడుకునేందుకు ప్రకృతి సేద్యం సేంద్రియ ఎరువులు వాడి నేనా ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు రసాయన పురుగు మందులను విచ్చలవిడిగా వినియోగం వల్ల వ్యవసాయం పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతాయి అన్నారు భూమి దున్నే సమయంలో పశువుల ఎరువును ఎకరాకు టన్ను ప్రకారం వేయాలి అన్నారు. తదితర విషయాలపై అవగాహన కల్పించారు.



## పేకాట శిబిరంపై పోలీస్ టాస్క్ ఫోర్స్ దాడి

**టీ మీడియా మే23,జనగామ:** జిల్లా చిల్పూర్ మండలం,రాజవరం గ్రామంలో పేకాటాడుతున్న 14 మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. గ్రామసమీపంలోని విహంగా రిసార్ట్ లో కొంతమంది వ్యక్తుల పేకాటాడుతున్నారని అందినసమాచారం మేరకు పోలీసులు దాడి చేపట్టారు.ఈ దాడుల్లో 14 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1,14,500నగదుతో పాటు మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు.




## భూసేకరణ పనులు త్వరతి గతిన పూర్తి చేయాలి

**టీ మీడియా, మే 23, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లాలో ఆయా విభాగాల కింద చేపడుతున్న భూసేకరణ పనులు త్వరతి గతిన పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశించారు. భూసేకరణ ముప్పు గ్రామాల పునర్వాస కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాటుపై గురువారం ఉదయంఐ డి ఓ సి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ వారంతపు సమీక్ష నిర్వహించారు. భూసేకరణ విషయాల్లో అధికారులకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముప్పు బాధిత గ్రామాల పునర్ వాస కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాటు విషయంలో లైన్ డిపార్ట్మెంట్ నీకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వర్షాకాలంలో ఇబ్బందులు లేవనెత్త కుండ ఇరిగేషన్ కాలువలు. చెరువు కాలువల. రాజులను ముందుగానే తెలుసుకొని అవసరమైన మరమ్మతులు చేసే లష్కర్ లను పంపించాలని ఇరిగేషన్ అధికారిని ఆదేశించారు. చెరువు కింద ఉన్న భూములు కబ్జా కాకుండా పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, వనపర్తి జిల్లా రెవెన్యూ కలెక్టర్ ఎం నాగేష్, వనపర్తి జిల్లా భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్, వనపర్తి ఆర్డిఓ పద్మావతి, వనపర్తి జిల్లా పంచాయతీరాజ్ శాఖ కార్యవర్గం ఇంజనీర్ మల్లయ్య, ఇరిగేషన్ శాఖకు చెందిన ఇంజనీర్లు భూ సేకరణ విభాగం నుండి గోకుల్ దాస్ పాల్గొన్నారు.